కళ్లకు కట్టినట్టు.. మనసుకు అద్దినట్టు..

- సత్ఫలితాలిస్తున్న డిజిటల్ విద్యాబోధన
- ఆరు నుంచి పది వరకు ఐఎఫ్‌పీల ద్వారా పాఠాలు
- ఆసక్తిగా వింటున్న విద్యార్థులు
- నాడు–నేడు ద్వారా నదుపాయాల కల్పన
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

తాళ్లరేవు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డిజిటల్ విద్యాబోధన సత్ఫలితాలనిస్తోంది. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చిన ప్రభుత్వం, విద్యాబోధనలో సైతం ఆధునికతను జోడిస్తూ డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచే స్మార్ట్ క్లాస్ రూములు అందుబాటులోకి వచ్చాయి. హైస్కూల్ స్థాయిలో ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ప్లాట్‌ఫాం పానెల్స్)ల్లో విద్యాబోధన ప్రారంభమైంది. విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చింది. తాళ్లరేవు మండల పరిధిలో నాడు–నేడు తొలివిడత పనులు పూర్తి చేసుకున్న ఏడు పాఠశాలలకు గానూ 91 తరగతి గదులలో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. ఏపీ ఫైబర్‌నెట్ సహాయంతో ఈ డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఐఎఫ్‌పీ ద్వారా సాగుతున్న డిజిటల్ తరగతుల పట్ల విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా డిజిటల్ విద్యాబోధన సాగుతోంది.


తాళ్లరేవు హైస్కూల్‌లో జరుగుతున్న డిజిటల్ బోధన

దృశ్య వీక్షణతో పూర్తి అవగాహన



తరగతి గదిలో ఉపాధ్యాయుడి సమక్షంలో పాఠ్యాంశాలను దృశ్య రూపంలో వీక్షించడం ద్వారా విద్యార్థులకు మంచి అవగాహన కలుగుతుంది. ఈ విధానం విద్యార్థులకు గొప్ప అనుభూతినిస్తుంది. ఇంటర్నెట్ వినియోగించి కంప్యూటర్ మాదిరిగా వినియోగించుకోవచ్చు. యూట్యూబ్, ఫోన్ లేదా ట్యాబ్‌లోని సమాచారం సైతం స్క్రీన్‌ పై చూసేందుకు అవకాశం ఉంటుంది. ఈ ప్యానెల్ బోర్డును బ్లాక్ బోర్డులా కూడా ఉపయోగిస్తున్నాం.

– కె.రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు, నీలపల్లి హైస్కూల్

తరగతి గదిలో డిజిటల్ ప్రపంచం



ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో డిజిటల్ ప్రపంచాన్ని చూస్తున్నాం. ప్రభుత్వం తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీల ద్వారా విద్యాబోధన ఆసక్తికరంగా సాగుతోంది. విద్యార్థులు ఆసక్తిని కనబరుస్తున్నారు.

– వాకపల్లి అప్పారావు, ఉపాధ్యాయుడు, తాళ్లరేవు హైస్కూల్

సబ్జెక్టులపై మంచి పట్టు



సాంకేతికతను జోడించి విద్యాబోధన చేయడం ద్వారా విద్యార్థులకు సబ్జెక్టులపై మంచి పట్టు వస్తుంది. మేము చెప్పిన పాఠాలతోపాటు యూట్యూబ్, బైజూస్ కంటెంట్‌లలో ఉన్న సమాచారాన్ని సైతం చూడడంతో విద్యార్థులకు అదనపు సమాచారం వస్తుంది. స్టోరేజీ విధానం ద్వారా ఒకసారి చూసిన దాన్ని సందేహాలు ఉన్నప్పుడు మళ్లీ చూసుకునే అవకాశం ఉంది. ఐఎఫ్‌పీలకు ఫోన్లు కనెక్టు చేసుకుని ఫోన్లో ఉన్న మెటీరియల్‌ను కూడా చూడడం వల్ల మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

– ఓలేటి కుమార్ శ్రీ, ఉపాధ్యాయుడు, పి.మల్లవరం హైస్కూల్

పాఠాలు బాగా అర్థమవుతున్నాయి



డిజిటల్ విద్యా బోధన చేయడం వల్ల మాకు పాఠాలు బాగా అర్థమవుతున్నాయి. ప్రతీ విషయాన్ని విపులంగా, కూలంకషంగా నేర్చుకుంటున్నాం. దీనివల్ల సబ్జెక్టులపై ఆసక్తి పెరిగి, చదువులో పట్టు సాధిస్తున్నాం. కార్పొరేట్ స్కూలు విద్యార్థులకు ఏ మాత్రం తీసిపోకుండా మంచి ఫలితాలు సాధిస్తాం. లక్షలాది రూపాయల విలువైన ఈ విధానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించడం మా అదృష్టం. ముఖ్యమంత్రి జగన మావయ్యకు కృతజ్ఞతలు.

–బందారు పావని, 8వ తరగతి విద్యార్థిని, పి.మల్లవరం హైస్కూల్

క్లుప్తంగా

40 మంది రక్తదానం

అమలాపురం టౌన్: రక్తదానం చేసేవారంతా ప్రాణ దాతలేనని అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ అన్నారు. స్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన రక్తదాన కార్యక్రమాన్ని డీఎస్పీ అంబికా ప్రసాద్ ప్రారంభించి ప్రసంగించారు. యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 40 మంది రక్తాన్ని ఇచ్చారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో తలసేమియా రోగులు, రక్తహీనతతో బాధపడుతున్న వారు, గర్భిణులకు సేకరించిన రక్తాన్ని వినియోగించనున్నారు.

కార్యవర్గం ఎన్నిక

అమలాపురం టౌన్: ఉప్పలగుప్తం మండలం యూటీఎఫ్ శాఖ స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో శుక్రవారం సమావేశమై మండలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. జి.సుబ్రహ్మణ్యం అధ్యక్షత జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే సత్యనారాయణ అతిథులుగా హాజరయ్యారు. ఉప్పలగుప్తం మండల శాఖ అధ్యక్షుడిగా అత్తిలి సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఏవీ చంద్రసూర్యం, కోశాధికారిగా డి.బుజ్జిబాబు, గౌరవాధ్యక్షుడిగా ఎస్.పద్మనాభన్ ఎన్నికయ్యారు.

ఆటో ఢీకొని కూలిన విగ్రహాలు


రంగుల వేయించి యథాస్థానంలో ఉంచిన విగ్రహాలు

అమలాపురం టౌన్: స్థానిక గోఖలే సెంటరులో గోపాల్ బిస్కెట్ కంపెనీ వద్ద రోడ్డు చెంత ఉన్న మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, శెట్టిబలిజ నేత దొమ్మేటి వెంకట్రావు విగ్రహాలు శుక్రవారం ఉదయం చూసే సరికి కూలిపోయి ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత విగ్రహాలను ఒక ఆటో ఢీ కొట్టడం వల్ల అవి కూలినట్టు ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు తెలిపారు. కూలిన విగ్రహాలను యథాస్థానంలో అమర్చి వాటికి కొత్తగా రంగులు వేయించారు. అమలాపురానికి చెందిన పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల సుభాషిణి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఘటనా స్థలానికి చేరుకున్నారు.

అవార్డు గ్రహీతకు యూటీఎఫ్ సత్కారం


ఉపాధ్యాయుడు బాలకృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు తదితరులు

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జీవ శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.బాలకృష్ణను యూటీఎఫ్ అమలాపురం శాఖ సత్కరించింది. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయుడు బాలకృష్ణను సత్కరించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి.చంద్రకళ పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న దిశ డీఎస్పీ మురళీమోహన్

అల్లవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దిశ డీఎస్పీ మురళీమోహన్ ఆధ్వర్యంలో మహిళల భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మురళీమోహన్ మాట్లాడుతూ పిల్లలపై ఆత్యాచారాలు, సైబర్ క్రైమ్, ప్రైవేటు కంపెనీల్లో రుణాల మోసాలు, మహిళా చట్టాలు, పోక్సో చట్టం, రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ట్రైనీ డీఎస్పీ వల్లెం విష్ణుస్వరూప్, మహిళా ఎస్సై కనకదుర్గ, ఎస్సై హరీష్‌కుమార్, ఇన్‌చార్జి హెచ్ఎం అయిలా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యవర్గం

అల్లవరం: అల్లవరం మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక అల్లవరం అభ్యుదయ పాఠశాలలో జిల్లా బీసీ ఉద్యోగులు సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేతా భాస్కరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. మండల శాఖ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్ష కార్యదర్శులుగా యనమదల ప్రభాకరరావు, అవనిగడ్డ కళ్యాణ్‌వర్మ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా పాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కోరుమిల్లి ప్రభాకర విశ్వనాథ్, కోశాధికారిగా కేవీవీ శివకుమార్, మరో ఏడుగురుతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కులగణనపై శిక్షణ

అల్లవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన కులగణన సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ సాంబశివప్రసాద్ మాట్లాడుతూ కులగణన సర్వే వారం రోజుల్లో పూర్తి చేయాలని, సర్వే మొత్తం ఒకే మొబైల్‌ని వినియోగించాలని సూచించారు. ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు, ఏఈ స్వామి, ఏపీఓ శ్రీనుబాబు పాల్గొన్నారు.

కనకాలపేట వరకు బస్ నడపాలి

యానాం: పట్టణం నుంచి సావిత్రినగర్‌వరకు ప్రస్తుతం నడుపుతున్న పీఆర్‌టీసీ బస్ సర్వీసును కనకాలపేట వరకు నడపాలని గ్రామస్తులు కోన ఆదినారాయణ తదితరులు శుక్రవారం ఆర్‌ఏఓ మునిస్వామికి, పుదుచ్చేరి ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కమ్ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. గతంలో కనకాలపేట వరకు బస్సును నడిపేవారని, కొన్నేళ్లుగా మానేశారని దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

రేపు ఎన్నికల పరిశీలకుని రాక

యానాం: నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటు నమోదు, సవరణ ప్రక్రియలను పరిశీలించేందుకు ఎన్నికల పరిశీలకుడు కేశవన్ ఆదివారం యానాం రానున్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, బీఎల్‌ఓలతో సమావేశమవుతారని ఆర్‌ఏఓ మునిస్వామి ప్రకటనలో తెలిపారు.

భవిత కేంద్రాన్ని పరిశీలించిన స్టేట్ అబ్జర్వర్

ముమ్మిడివరం: భవిత కేంద్రాన్ని స్టేట్ అబ్జర్వర్ అబ్బుల్ గని శుక్రవారం పరిశీలించారు. సహిత విద్యా సమన్వయ కర్త సత్యనారాయణ, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు కలిసి భవిత కేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భవిత విద్యార్థుల హాజరు శాతం, విద్యాబోధన తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఒకేషనల్ యాక్టివిటీస్ గురించి స్వయంగా విద్యార్థులను, తల్లితండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట విద్యాశాఖాధికారులు, ఎంఈఓ బొజ్జారమణ శ్రీ, ఆర్. ఉదయ భాస్కర్, సీఆర్‌పీ శ్రీను, భవిత కేంద్రం సిబ్బంది, తల్లితండ్రులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

యానాం: లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ, శ్రీమతి రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ వైద్యశాల జగ్గంపేట ఆధ్వర్యంలో శనివారం యానాంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు శుక్రవారం అధ్యక్షుడు పులవర్తి శ్రీను తెలిపారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కార్యాలయం వద్ద ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వెనుకబడిన వర్గాలకు వెన్నుదన్నుగా..

అమలాపురం రూరల్: వెనుకబడిన వర్గాలకు వెన్నుదన్నుగా కేంద్రం ఉందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమా అన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చెల్లింగి త్రినాధరావు అధ్యక్షతన పేరూరులో ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల నాగేంద్ర కుమార్‌యాదవ్ , ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి వీర్ల కృష్ణ , ఓబీసీ మోర్చా జిల్లా ఇంచార్జి చీపురి వాసు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బీజేపీలో ఓబీసీలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నారని, జనాభాకు అనుగుణంగా మరింత ప్రాధాన్యత కల్పించాలని ప్రధాని మోదీని కోరినట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాల అమలుతో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు అన్నారు. స్థానిక శ్రీరామనగర్‌లో గల వార్డు సచివాలయం వద్ద శుక్రవారం జరిగిన 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని కమిషనర్ నాయుడు ప్రారంభించి ప్రసంగించారు. మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ అధ్యక్షతన జరిగిన సభలో లబ్ధిదారులకు ఏఏ పథకాల ద్వారా ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరించారు. పట్టణ గృహ సారథుల కన్వీనర్ ఈతకోట శ్రావణ్ కుమార్ సంక్షేమ పథకాల గురించి వివరించారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాలు, లబ్ధి సమాచారంతో ఉన్న ఫ్లెక్సీ బోర్డును కమిషనర్ నాయుడు, కౌన్సిలర్ రాజేష్ ప్రారంభించారు.

గూడాలలో ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే

అల్లవరం: ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గూడాల సచివాలయంలో సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి, ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎంతైనా అవసరమన్నారు. బడుగు బలహీన వర్గాల వారికి సంక్షేమ పథకాలు పారదర్శకంగా పంపిణీ కావాలంటే సీఎం జగన్ ఏపీకి ముఖ్యమంత్రిగా మరోమారు కావాలని అన్నారు. సచివాలయం వద్ద సంక్షేమ బోర్డును ఆమె ఆవిష్కరించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి ఇంటింటికి సంక్షేమ పథకాలపై సర్వే నిర్వహించారు. జేసీఎస్ మండల కన్వీనర్ తిక్కాప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను, ఏఎంసీ డైరెక్టర్ ఈతకోట సతీష్, గ్రామకమిటీ అధ్యక్షుడు ముత్తాబత్తుల సంతోష్ పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి పెద్ద పీట

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్యకు, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి సచివాలయం 1 పరిధిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందిన సంక్షేమాల పట్టికను ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను గ్రామ పార్టీ ఇన్‌చార్జి జోగిరాజా ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో డీబీటీ రూ.11,92,98,727, నాన్ డీబీటీ రూ.4,54,76,206 మేర లబ్ధి ప్రజలకు చేరిందని సంపదరావు వివరించారు. సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షుడు నండింపల్లి వాసురాజు, మండల జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, యువజన విభాగం మండల అధ్యక్షుడు ఓగూరి విజయ్‌కుమార్, బీసీ సెల్ కన్వీనర్ యనమదల పల్లంరాజు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న కమిషనర్ నాయుడు, కౌన్సిలర్ రాజేష్

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

ఐ.పోలవరం: సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలందరూ ముక్తకంఠంతో కోరుకుంటున్నారని జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్ రాజు అన్నారు. మండలంలోని గోగుల్లంక సచివాలయ పరిధిలో ఈతకోటి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, మండల పార్టీ అధ్యక్షుడు పిన్నంరాజు వెంకటపతి రాజు, ఎంపీపీ మెర్ల రాణిమిరియం జ్యోతి మాట్లాడుతూ 33సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా సొమ్మును జమ చేశారన్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి అధిక నిధులు గ్రామానికి ఖర్చు చేశారని వివరించారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ములపర్తి శ్రీరాములు, పడాల సత్యనారాయణ,లంకే ప్రసాద్, ఇసుకపట్ల అచ్చిబాబు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న బాపూజీ


బండారులంకలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ దోలామణి

ఎన్నో సంక్షేమ పథకాలు

అమలాపురం రూరల్: సీఎం జగనన్న 53నెలల ప్రభుత్వం పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను పేదల కోసం అమలు చేశారని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి అన్నారు. బండారులంక సచివాలయం– 2 పరిధిలో ఏపీకీ జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆమె ఆవిష్కరించారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.26 75కోట్లు బండారులంక గ్రామంలో ఖర్చు చేశామని తెలిపారు. సచివాలయ కన్వీనర్ మట్టపర్తి తేజ, పీవోపీర్డీ గుబ్బల మల్లికార్జునరావు, వార్డు మెంబర్ నూకపై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రానికి సీఎం జగన్ అవసరం

కాట్రేనికోన: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఎంతైనా ఉందని మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి అన్నారు. కాట్రేనికోన గ్రామ సచివాలయం –1లో సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ అధ్యక్షతన శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు సంసాని నాగేశ్వరరావు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాతి సత్యనారాయణ మాట్లాడుతూ నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చేశారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను బలోపేతం చేసి సేవలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అవసరం రాష్ట్రానికి ఎంతైనా ఉందన్నారు. వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, అల్లూరి మధు, మోకా చంద్ర నాగరత్నం, జగడం బాలయ్య, వాసంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎస్.కొత్తపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

జగన్‌తోనే సంక్షేమ పాలన

ముమ్మిడివరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమవుతుందని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 4,5,6 వార్డుల సచివాలయ వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నగర పంచాయతీ పరిధిలో 11వేల మంది లబ్ధిదారులకు డీబీజీ, నాన్ డీబీటీ ద్వారా రూ.23,33కోట్లు అందజేశామన్నారు. కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్, ఏ.శ్రీనివాస్, కాశి బాలమునికుమారి, గణేశులబ్రహ్మానందం,శ్రీవాణి, కమిషనర్ జి.లోవరాజు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రారంభం

అమలాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల లబ్ధి మారుమూల వరకు చేర్చాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్పయాత్రను ప్రారంభించినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సంచాలకులు శోభిత్ గుప్తా తెలిపారు. శుక్రవారం అమలాపురం మండలం పేరూరులో వికసిత్ భారత్ సంకల్పయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల్ని చేరుకుని అర్హులందరికీ పథకాలు అందేలా చూసేందుకు ముందుగా గిరిజన ప్రాంతాలలో ప్రచారాన్ని ప్రారంభించారని, వచ్చే ఏడాది జనవరి 25 నాటికి దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాలను కవర్ చేస్తామన్నారు. ప్రతి ప్రచార వాహనం రెండు గంటలపాటు గ్రామ పంచాయతీలో ఉండి, ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి వాటిని అందేలా చూస్తుందన్నారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరు చేస్తున్న రూ.1.80 లక్షలు గృహ నిర్మాణానికి సరిపోవడం లేదని, రూ.ఐదు లక్షలకు పెంచాలని, తాగునీటి సమస్య పరిష్కారానికి ధవళేశ్వరం నుంచి ప్రతిపాదించిన వాటర్ గేట్ పథకానికి కేంద్రం సహకరించాలని కోరారు. ఆర్డీవో జి.కేశవవర్ధన్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి, డీఆర్‌డీఏ పీడీ వి. శివశంకర్‌ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ వేమా, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి, సర్పంచ్ దాసరి అరుణ, ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు, కార్యదర్శి రుద్రరాజు సూరపరాజు, ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బిరామ్, వాసంశెట్టి శ్రీను, దొంగ ఆంజనేయులు పాల్గొన్నారు


సభలో మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక శాఖ సంచాలకులు శోభిత్ గుప్తా, కలెక్టర్ శుక్లా

సంక్షిప్తంగా..

మహా ధర్నాపై సమావేశం

అమలాపురం టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కర్షక, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వాసంశెట్టి సత్తిరాజు విజ్ఞప్తి చేశారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో కార్మిక సంఘాలు, రైతు వ్యవసాయ కార్మిక సంఘంఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముగిసిన విచారణ

అల్లవరం: గూడాల గ్రామ సమైఖ్య సంఘంలో స్త్రీ నిధి, ఉన్నతి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల దుర్వినియోగంపై డీఆర్‌డీఏ అధికారులు చేపట్టిన విచారణ శుక్రవారంతో ముగిసింది. గూడాల–3 పరిధిలోని స్త్రీ నిధి రుణాలు పొందిన 15 సంఘాలు, ఉన్నతిలో రుణాలు పొందిన 13 సంఘాలకు డీపీఎం విజయ్‌కుమార్, స్త్రీ నిధి ఏజీఎం ప్రసన్నలక్ష్మీ మూడు దఫాలుగా విచారణ చేశారు. నివేదికను పీడీ దృష్టిలో ఉంచామని ఏపీఎం సయ్యద్ తెలిపారు.

60 మద్యం బాటిళ్ల స్వాధీనం

అమలాపురం టౌన్: యానాం నుంచి అక్రమ మద్యాన్ని మోటారు సైకిల్‌పై తరలిస్తున్న నిందితుడిని అమలాపురంలో అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 60 బాటిళ్ల మద్యం, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. అమలాపురం మార్కెట్ వీధికి చెందిన బుంగ శ్రీనును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం స్థానిక ఎర్రవంతన సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో పట్టణ సీఐ టి.క్రాంతికుమార్, ఎస్సై కె.మనోహర్ జోషిలకు అక్రమ మద్యం రవాణా సమాచారం రావడంతో మాటు వేసి బుంగ శ్రీనును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడు శ్రీనుకు కోర్టు రిమాండ్ విధించడంతో అతడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

మద్యం పట్టివేత

యానాం: సావిత్రినగర్‌లో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, బీర్ బాటిల్స్‌ను శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు ఎస్సై శేరు నూకరాజు తెలిపారు. ఓల్డ్ సావిత్రినగర్‌లో పెమ్మాడి నూకరత్నం ఇంట్లో నిల్వ ఉంచిన నాలుగు కేసుల 750ఎంఎల్ బాటిల్స్, ఒక కేస్ 180ఎంఎల్ బాటిల్స్‌ను, 169 బీర్‌బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ మొత్తం రూ.40వేలు ఉంటుందన్నారు.

ధ్యానం సకల రోగ నివారిణి

తాళ్లరేవు: ధ్యానం చేయడం ద్వారా సకల రోగాలను నియంత్రించవచ్చని యోగా గురువులు వై.రామమూర్తి, శ్రీవల్లి తెలిపారు. శుక్రవారం పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేటలోని మాతాజీ ఆశ్రమంలోని పిరమిడ్ ధ్యాన మందిరంలో ఒకరోజు ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. యానాంకు చెందిన అన్యం రామకృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ పత్రీజీ బోధనలను వినిపించారు.

కామాక్షీ పీఠంలో 'కార్తిక' కాంతులు


పూజలు చేస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: కార్తిక మాసం రెండో శుక్రవారం స్థానిక శ్రీకామాక్షీ పీఠంలో వందలాది మహిళలు పీఠానికి తరలి వచ్చి కామాక్షీదేవి సమక్షంలో దీపాలు వెలిగించడంలో పీఠం సందడిగా కనిపించింది. దీపాలు వెలిగించి కామాక్షీ అమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని మహిళలు దర్శనం చేసుకున్నారు. మహిళలను పీఠాధిపతి కామేశ మహర్షి ఆశీర్వదించారు. పీఠం బాల బ్రహ్మచారి విఘనస రాఖీ ప్రేమ్ పీఠంలోని శ్రీకామాక్షీ రామలింగేశ్వరులకు పంచామృత అభిషేకాలు చేశారు.

హైస్కూల్ ఆకస్మిక తనిఖీ

అమలాపురం రూరల్: పాఠశాల సందర్శనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర ఐఈ కోఆర్డినేటర్ అబ్దుల్ గని, జిల్లా సహిత విద్య సమన్వయ కర్త సత్యనారాయణ, జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ కమిటీ అధికారి బొరుసు వీర వెంకట సుబ్రహ్మణ్యం, ఉర్దూ అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి ఎస్‌కే మొయినుద్దీన్ ఆకస్మికంగా బండారులంక జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. అసెంబ్లీ జరుగుతున్న తీరు, జగనన్న విద్యకానుకగా విద్యార్థులకు అందించిన వస్తువులు అందరూ ధరించి పాఠశాలకు వస్తున్నారా లేదా అని హెచ్ఎం ఎస్ఎల్‌వీ బాలను అడిగి తెలుసుకున్నారు.పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. స్థానిక భవిత సెంటర్‌ను సందర్శించి పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బేసిక్ స్కిల్స్ ను అభివృద్ధి చేయాలని కోరారు. ఎంఈవో సరెళ్ళ దుర్గాదేవి, ఉపాధ్యాయులు మోర్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేత్రదానం


చింతా రవీంద్రనాథ్ (ఫైల్ ఫొటో)

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరం గ్రామానికి చెందిన చింతా రవీంద్రనాథ్(66) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. ఆయన కుటుంబ సభ్యులు చిన్నారి, రాజాచంద్రశేఖర్, రాజేంద్ర కుమార్, రజని, గ్రేస్, శాంతి ఆయన నేత్రాలను దానం చేయడానికి అంగీకరించారు. కాకినాడకు చెందిన ఐ–బ్యాంక్ సిబ్బంది వారికి గృహానికి చేరుకుని కార్నియాను సేకరించారు. రవీంద్ర కుటుంబ సభ్యులను పలువురు గ్రామస్తులు అభినందించారు.